క్లుప్తంగా

జోడో యాత్రను విజయవంతం చేయండి


ప్రచారం చేస్తున్న నాయకులు

టేకులపల్లి: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ములుగు నుంచి ప్రారంభం అవుతున్న హాత్ సే హాత్ జోడో యాత్రను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఇల్లెందు నియోజకవర్గ నేత చీమల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం టేకులపల్లి మండలం చింతోనిచెలక, చింతోనిచెలక తండా, రోడ్డు గుంపు, వజ్జోనిగూడెం, మేళ్లమడుగు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. జోడో యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ.. ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టేకులపల్లి మండల అధ్యక్షుడు భూక్య దేవానాయక్, మాజీ సర్పంచ్ వీసం శ్రీనివాస్‌రావు, సర్పంచ్ మాడె మధు, బాడిశ సమ్మయ్య, వెంకన్న, శంకరయ్య, విశ్వనాథం, రామనాథం, పాపారావు, సుశీల, అబ్బయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా

జూలూరుపాడు: వ్యవసాయ రంగానికి 24 గంటలు నిరంతరాయంగా విద్యుత్ సరాఫరా చేయాలని, ఏసీడీ పేరుతో వేస్తున్న అదనపు విద్యుత్ చార్జీలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జూలూరుపాడు విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలి సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు చంద్ర నరేంద్రకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. సీపీఐ, తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీల పిలుపు మేరకు సీపీఐ–ఏఐకేఎస్ మండల కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ధర్నా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, రైతులు విజయవంతం చేయాలని కోరారు.

పరామర్శ


నివాళి అర్పిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

టేకులపల్లి: కోయగూడెం మాజీ సర్పంచ్ పూనెం సురేందర్‌కు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి పూనెం అమ్మాయమ్మ(80) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోయగూడెంకు వచ్చి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించినవారిలో జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య, డీసీసీబీ డైరెక్టర్లు లక్కినేని సురేందర్ రావు, తుళ్లూరి బ్రహ్మయ్య, సొసైటీ మాజీ చైర్మన్ దళపతి శ్రీనివాస్‌రాజు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

జాతరకు భారీగా భక్తులు


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఇల్లెందురూరల్: బొజ్జాయిగూడెం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో కొలువుదీరిన వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. గద్దెల వద్ద వారం రోజులుగా కొనసాగుతున్న మినీ జాతరకు భక్తులు ఆదివారం సెలవుకావడంతో భక్తులు భారీగా తరలివచ్చి వన దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు జాగ్రత్తలు తీసుకున్నారు.

వ్యాపారులను పోలీసులకు అప్పగింత

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం హర్యాతండాలో నకిలీ వరి విత్తనాలను విక్రయించిన వరంగల్‌కు చెందిన నలుగురు వ్యక్తులకు గ్రామస్తులు ఆదివారం పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వివరాలు... వరంగల్‌కు చెందిన నలుగురు వ్యక్తులు వరి విత్తనాలను రేగళ్ల గ్రామ పంచాయతీలోని హర్యా తండాలోని రైతులకు విక్రయించారు. ఈ విత్తనాలను రైతులు తమ పొలాల్లో చల్లగా మొలకలు రాలేదు. ఆగ్రహించిన రైతులు రెండు నెలలుగా వారికి ఫోన్ చేస్తుండగా వారు స్పందించలేదు. ఆ నలుగురు వ్యక్తులు ఆదివారం హర్యా తండాకు రావటంతో రైతులు వారిని అడ్డుకొని, పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ ప్రవీణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భగీరథ ట్యాంకు నిరుపయోగం

- దుబ్బతండాలో తాగునీటి సమస్య
- పట్టించుకోని అధికారులు


తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్న దుబ్బతండా గిరిజనులు

జూలూరుపాడు: కాకర్ల గ్రామ పంచాయతీ దుబ్బతండా గిరిజన ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఇంటికి నల్లా ద్వారా మంచినీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టింది. దుబ్బతండాలో సుమారు 100 గిరిజన లంబాడి కుటుంబాలకు చెందిన సుమారు 350 మంది జనాభా. గ్రామంలో తాగునీటికి రెండున్నరేళ్ల క్రితం రూ.లక్షలు వెచ్చించి 20 వేల లీటర్ల సామర్థ్యం గల మిషన్ భగీరథ ట్యాంకును నిర్మించారు. ఇంటింటికీ నల్లాలు అమర్చారు కానీ తాగునీటి సరఫరా చేయడం లేదు. ప్రతి ఏడాది వేసవికాలంలో గిరిజనులు తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి సమస్య తీరుతుందని ఎంతో ఆశపడ్డ గిరిజనులకు చివరకు నిరాశే మిగిలింది. గతంలో రక్షిత మంచినీటి కోసం సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో డైరెక్టింగ్ పంపింగ్ వ్యవస్థ(డీపీ)లు రెండు ఏర్పాటు చేయగా ఇందులో ఒకటి మాత్రమే నామమాత్రంగా పని చేస్తుండగా మరొకటి పని చేయడంలేదు. త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఉన్నప్పుడే మాత్రమే వస్తుందని, బోరు బావిలో కూడా నీటి సామర్థ్యం లేక ఆగి ఆగి నీళ్లు వస్తుంటాయని గిరిజనులు చెప్తున్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయం వద్ద ఉన్న డీపీ నీళ్లు తాగడానికి పనిరావు.


దుబ్బతండాలో అలంకారప్రాయంగా మిషన్ భగీరథ ట్యాంకు

గ్రామంలోని మూడు చేతి పంపుల్లో ఒకటి మూలనపడగా, ప్రభుత్వ పాఠశాలలో ఉన్న చేతి పంపుకు విద్యుత్ మోటార్‌ను అమర్చారు. ఇటు మిషన్ భగీరథ నీళ్లు రాక మరో వైపు డీపీ, చేతి పంపుల నీళ్లు తాగడానికి పనికి రాక గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. దుబ్బతండాలో ఏ ఇంట్లో చూసినా ఖాళీ బిందెలు, డ్రమ్ములు, నీటి తొట్లు, పాత్రలు దర్శనమిస్తున్నాయి. మంచినీళ్ల కోసం మూడు కిలోమీటర్ల దూరంలో కాకర్ల గ్రామ సమీపంలో శ్రీపెద్దమ్మతల్లి ఆలయం వద్ద గల చేతి పంపు నుంచి, వ్యవసాయ బావుల వద్ద నీళ్లు తెచ్చుకొని తాగుతున్నట్లు చెప్పారు. వేసవి కాలం రాకముందే ఇలాంటి పరిస్థితులు ఉంటే తరువాత ఏలా ఉంటుందోనని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుబ్బతండా ఎత్తులో ఉండటంతో పైపులైన్ పగిలి లికేజీ కారణంగా నీళ్లు సరఫరా కావడం లేదని అధికారులు చెప్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.


బిందెలు, నీటి తొట్లను చూపిస్తున్న వృద్ధుడు

తాగునీళ్లు రావడం లేదు



భగీరథ ట్యాంకు నిర్మించినా మంచినీళ్లు రావడం లేదు. గుక్కెడు మంచినీళ్ల కోసం అష్టకష్టాలు పడుతున్నాం. చేతి పంపులు, డీపీలు సక్రమంగా పని చేయడం లేదు. – బానోత్ మంగమ్మ, దుబ్బతండా

సమస్య పరిష్కరించాలి



ఎన్నో ఏళ్లుగా తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. మిషన్ భగీరథతో తాగునీటి సమస్య తీరుతుందని ఆశపడ్డాం. నీళ్లు రావడం లేదు. తాగునీటి సమస్య పరిష్కరించాలి. – భూక్యా వీరు, దుబ్బతండా

నీళ్లు దొరకడం కష్టంగా ఉంది



గుక్కెడు మంచినీళ్లు దొరకడం కష్టంగా ఉంది. మిషన్ భగీరథ ట్యాంకు నిర్మించారు గానీ నీళ్లు ఎక్కకపోవడంతో నిరుపయోగంగా ఉంది. తండాలో తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. – బానోత్ కోటి, కాకర్ల

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



దుబ్బతండా గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రెండు చేతి పంపులు, రెండు డీపీలు పని చేస్తున్నాయి. అధికారులకు సమస్యను వివరించినా స్పందించడం లేదు.
– బానోత్ రమాదేవి, కాకర్ల గ్రామ సర్పంచ్

ఘనంగా విగ్రహ పునఃప్రతిష్ఠ


విరాళం అందిస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు

పాల్వంచ: పాల్వంచ పట్టణంలో ప్రముఖ అయ్యప్ప స్వామి ఆలయ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయ మేల్ తంత్రి శ్రీ కంఠారరు మహేశ్వరారు మోహనరరు తంత్రి, శబరిమల వంశ పారంపర్య ప్రధాన తంత్రి కంఠారరు మోహనరరు తంత్రి, ఆలయ అర్చకులు నరసింహామూర్తిలచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మాధురి దంపతులు హాజరై ఆలయానికి రూ.5,00,116, గోపాలరావు రూ.1,00,116 విరాళం అందించారు. జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, కూనంనేని సాంబశివరావు, సాబీర్ పాషా, ఎడవల్లి కృష్ణ, రంగా కిరణ్, కొత్వాల శ్రీనివాసరావు, బరపటి వాసుదేవరావు తదితరులు హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

చుంచుపల్లి: పెనగడప గ్రామపంచాయతీలో ఆదివారం ముత్యాలమ్మ తల్లి, బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నర్సింహాసాగర్ గ్రామంలో...

సుజాతనగర్: నర్సింహాసాగర్ గ్రామంలో ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ, బోనాల కార్యక్రమాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ సభ్యుడు ఎడవల్లి కృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బత్తుల వెంకటేశ్వరావు, రామనాథ, హత్తీరాం, భూక్యా శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

ఇల్లెందు: ఇల్లెందు పరిసర ప్రాంతంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములన్నీ పేదలకు, ఆదివాసీలకు పంపిణీ చేయాలని ఆదివాసీ ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణ దొర డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బాలాజీనగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. బాలాజీనగర్‌లో పేదలు ప్రభుత్వ భూమిని ఆక్రమించి గుడిసెలు వేసుకున్నారని, అలాంటి వారికి ఆ భూమిని కేటాయించి పట్టాహక్కులు కల్పించాలని కోరారు. కొంతకాలంగా ఇల్లెందు, చుట్టుపక్కల గ్రామాలలో పేదలు ఉండటానికి ఇంటి జాగా లేక అల్లాడుతున్నారని తెలిపారు. అధికార పార్టీని అడ్డుపెట్టుకుని కొంతమంది ఎకరం భూమిని ఆక్రమించినట్లు చెప్పారు. అధికార పార్టీ అగ్ర నాయకత్వం పేదలపక్షం వహిస్తుందో నిత్యం భూములు ఆక్రమించే ఆక్రమణదారులైన ప్రజాప్రతినిధులకు గొడుగు పడుతుందో తేల్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కంగాల వసంత్, వజ్జ శ్రీను, చీమల విజయ, ఇర్ప లత, శాంతమ్మ, నాగమ్మ, కుమారి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రామకృష్ణ దొర

దరఖాస్తుదారులను పక్కదారి పట్టిస్తున్నారు


మాట్లాడుతున్న రఘుమాచారి

కొత్తగూడెంఅర్బన్: సమాచార హక్కు చట్టం దరఖాస్తుదారులను పక్కదారి పట్టించేలా వ్యవహరించే ప్రభుత్వ అధికారులపై కమిషన్ కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ వినియోగదారుల, సమాచార హక్కుల చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు జూలూరి రఘుమాచారి తెలిపారు. ఆదివారం రైతు బజార్ ఏరియాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ కుసుమకుమారికి గత ఏడాది నవంబర్ నెలలో సమాచారం కోసం దరఖాస్తు సమర్పించగా, గడువు దాటిపోయినా అధికారి స్పందించకపోవడం వలన రాష్ట్ర సమాచార కమిషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. దీంతో స్పందించిన రాష్ట్ర కమిషన్ సంబంధిత అధికారికి షోకాజ్ నోటీసు పంపిస్తూ తక్షణమే దరఖాస్తుదారు కోరిన సమాచారాన్ని పూర్తిగా అందజేయాలని, లేదంటే షోకాజు నోటీసుపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సమాచార హక్కు చట్టం పట్ల అధికారులు బాధ్యతయుతంగా, జవాబుదారీతనంతో వ్యవహరించాలని కమిషన్ సూచించిందని వివరించారు. సమావేశంలో ఎల్లయ్య, గోవిందాచారి, శ్రీనివాస్, వంశీ, శ్రావణ్, చరణ్, గణేష్, నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు చేరిన దీక్షలు

ఇల్లెందురూరల్: కొమరారంను మండల కేంద్రంగా ప్రకటించాలనే డిమాండ్‌తో ప్రజాపంథా ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం ఐదో రోజుకు చేరుకున్నాయి. కొమరారం, పోలారం గ్రామపంచాయతీలకు చెందిన వ్యాపారులు, ఉద్యోగులు అనుగోజు పెద్దచారి, పొద్దుటూరి సురేష్, చిన్నచారి, ఎర్రోజు నవీన్, ఉమామహేశ్వరరావు, ఉపేందర్, కోరం కృష్ణ, గుర్రం వెంకన్న తదితరులు ఐదో రోజు దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ అజ్మీర బిచ్చా, సర్పంచ్ నాళి కృష్ణవేణి మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షను విస్మరించి రాష్ట్ర ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. గతంలో కొమరారంను మండలంగా ప్రకటిస్తామని హామీ ఇచ్చిన పెద్దలు నేడు ఆ దిశగా ప్రయత్నం చేయడం లేదని ఆరోపించారు. సౌకర్యాలు, విస్తీర్ణం సమగ్రంగా ఉన్న కొమరారంను మండల కేంద్రంగా ప్రకటించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఐదో రోజు దీక్షలకు బీఎస్పీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు లక్ష్మణ్, రాములు, రాజాలు, కృష్ణ, రాంచంద్, గుర్రం రాములు, కమలమ్మ, సరిత, సుశీల, బీఎస్పీ నాయకులు శ్రీనివాసరావు, జ్ఞాన సుందరం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీటీసీ అజ్మీర బిచ్చా

ఘనంగా సమ్మక్క మినీ జాతర




శ్రీసమ్మక్క దేవత గద్దె (ఇన్‌సెట్) ప్రధాన పూజారి కట్రం నరసింహారావు

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం గ్రామంలోని చిలకలగుట్ట వద్ద ఉన్న శ్రీ సమ్మక్క–సారలమ్మ దేవతల మినీ జాతర ఈనెల 8, 9వ తేదీల్లో జరగనుంది. ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రతి రెండేళ్లకోసారి జాతర జరుగుతుంది. 23 ఏళ్ల క్రితం వేసవికాలంలో గుట్టపై నుంచి నీళ్లు జాలు వారడంతో గ్రామంలోని ఆదివాసీలు శ్రీ సమ్మక్క–సారలమ్మ దేవతల మహిమ వల్లనే జరిగిందని నమ్మకంతో ఆనాటి నుంచి దేవతలకు పూజలు చేయడం ప్రారంభించారు. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే దేవతలుగా ప్రజల్లో విశ్వాసం పెరగటంతో ప్రాంతంలోని ప్రజలు నిత్యం దేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తుంటారు. ఈ మినీ జాతరకు మండల ప్రజలతోపాటు, పరిసర మండలాల ప్రజలు తరలి రానున్నారు. మేడారం జాతరకు ముందుగా ప్రతిసారి ఫిబ్రవరి 9 నుంచి 12 వరకు నాలుగు రోజులు పాటు జాతరను నిర్వహిస్తున్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలతో ఆలయ ప్రధాన పూజారి కట్రం నరసింహారావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరగనున్నాయి.

నేడు గ్రామసభలు

సుజాతనగర్: రెండో విడత సామాజిక తనిఖీలో భాగంగా సుజాతనగర్, కోయగూడెం, లక్ష్మీదేవిపల్లి, మాలబంజర, జామ్లా తండా, 2 ఇంక్‌లైన్, మంగపేట గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీల సందర్భంగా వెల్లడైన అంశాలను ఈ గ్రామసభల్లో డీఆర్‌పీలు నివేదిక రూపంలో చదివి వినిపించడం జరుగుతుందన్నారు.

ముగిసిన 'గేట్'

సుజాతనగర్: మండలంలోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న గేట్–2023 పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం సెషన్‌లో 111 మంది విద్యార్థులకు గాను 89 మంది హాజరయ్యారు. 22 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 68 మంది విద్యార్థులకు గాను 57 మంది హాజరై 11 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు శనివారం ప్రారంభం కాగా తొలిరోజు రెండు సెషన్లలో కలిపి 133 మంది పరీక్షలకు హాజరయ్యారు.

వైద్యశిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పాల్వంచ: పట్టణంలోని కేఎస్‌పీ రోడ్డులోని శ్రీ భాగ్య ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ సురేశ్ పాద్య, ఎండీ జనరల్ డాక్టర్ శంకర్, గైనకాలజిస్ట్ డాక్టర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలు భారీ సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా సురేశ్ పాద్య మాట్లాడుతూ.. ప్రస్తుతం వైద్యం ఖరీదుగా మారిన సమయంలో పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించామన్నారు. ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు తమవంతు తోడ్పాటు నందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎండీ సర్జన్ సోమరాజు దొర, చిన్న పిల్లల వైద్య నిపుణులు కోరశ్రీయాదవ్, వర్తక సంఘం కన్వీనర్ ప్రకాష్, లక్ష్మీనారాయణరెడ్డి, రాధ, గౌరీ శంకర్, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ


సరుకులు అందజేస్తున్న దృశ్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమళ్ల పంచాయతీ గంగమ్మ కాలనీలో ఆదివారం స్ట్రీట్ సోషల్ సర్వీసెస్(ఎస్‌జిఎ) అనే స్వచ్ఛంద సంస్థ 30 గిరిజన కుటుంబాలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గిరి భార్గవ్, ఉపాధ్యక్షుడు కల్యాణ్, కార్యనిర్వాహక సభ్యుడు పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

టేకులపల్లి: బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజు ఫిబ్రవరి 15న సెలవుదినంగా ప్రకటించాలని సేవాలాల్ సేన జిల్లా, ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాళోతు శివనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సేవాలాల్ ఆలయంలో జరిగిన సంఘం సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానించారు. సేవాలాల్ జయంతిని ప్రతి తండాలోనూ బంజారాలు అత్యంత వైభవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. టేకులపల్లి మండలాన్ని కేటీఆర్ దత్తత తీసుకోవాలని, కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలని కోరారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, జీఓ నంబర్ 3ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. యువతీ, యువకులు చెడుమార్గాల్లో పయనించకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో బెల్టుషాపులు నివారించాలని, వైన్ షాపుల్లో అధిక రేట్లను నియంత్రించాలని, ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాందాస్, మల్సూర్, రాము, ఫూల్‌సింగ్, దేవేందర్, దేవ్‌సింగ్, కృష్ణ, రాకేష్, గణేష్, బాలకృష్ణ, వినోద్, సాయికృష్ణ, రుబిన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శివనాయక్

పీవోడబ్ల్యూ మహాసభలను జయప్రదం చేయండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: ఈనెల 7, 8 తేదీల్లో మహబూబాబాద్‌లో జరగనున్న ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకురాలు భూక్యా చిన్ని, చింత లాలమ్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం తుమ్మలచెలక గ్రామంలో రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మహాసభలకు మహిళలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. మహిళలపై రోజురోజుకు దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని, వీటిని నియంత్రించడంలో పాలకులు విఫలం అవుతున్నారని విమర్శించారు. మహిళా హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమన్నారు. కార్యక్రమంలో బుజ్జి, కలమ్మ, లక్ష్మి, రేణుక, రాధ, సరోజ, రాజేశ్వరి, భద్రమ్మ, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్నల్ పరీక్షలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి డ్రిల్ ఆపరేటర్ ట్రైనీ కేటగిరి–1 (ఇంటర్నల్) రాత పరీక్షకు 2,944 మంది హాజరయ్యారని, సింగరేణి డైరెక్టర్(పా) అండ్ ఫైనాన్స్ ఎస్.బలరామ్ పేర్కొన్నారు. ఆదివారం కొత్తగూడెంలో జరిగిన ఎనిమిది సెంటర్లను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూలై 2022లో ఇచ్చిన నోటిఫికేషన్‌కు స్పందించి 11 ఏరియాల్లో ఉన్న కార్మికులలో అర్హత కలిగిన సుమారు 4,800 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. వీటిని స్క్రూటినీ చేసిన యాజమాన్యం సుమారు 3,498 మందికి హాల్‌టికెట్లు పంపిణీ చేయగా ఈరోజు జరిగిన పరీక్షకు 2,944 హాజరయ్యారని తెలిపారు. ఈ రాత పరీక్ష సెక్యూరిటీ, విజిలెన్స్ సిబ్బంది పర్యవేణలో మెటల్ డిటెక్టర్, సీసీ కెమరాల నిఘా మధ్య కట్టుదిట్టంగా సింగరేణి యాజమాన్యం నిర్వహించటం జరిగిందన్నారు. ఫలితాలు ఈరోజు రాత్రి సింగరేణి ప్రధాన కార్యాలయం నోటీస్ బోర్డ్‌లో, సింగరేణి వెబ్‌సైట్‌లో తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో జీఎం పర్సనల్ (రిక్రూట్‌మెంట్ సెల్) కే.బసవయ్య, చీఫ్ సెక్రటరీ ఆఫీసర్ హనుమంతరావు, డీజీఎం విజిలెన్స్ వీఎస్‌వీఎస్ఆర్ శాస్త్రీ, ఎస్‌వీరావు, హెచ్‌ఆర్‌డీ బి.హెచ్ వెంకటేశ్వరరావు, ఏజీఎం (ఐడీ) సుశాంత్ సాహు, వివిధ కళాశాలల నిర్వాహకులు పాల్గొన్నారు.


పరీక్షలను పర్యవేక్షిస్తున్న డైరెక్టర్(పా) బలరామ్

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా భారీ వృక్షం

సుజాతనగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని ఓ భారీ వృక్షం ఎండిపోయి ప్రమాదకరంగా ఉంది. వచ్చిపోయే గాలికి భారీ స్థాయిలో కొమ్మలున్న ఈ చెట్టు విరిగి పడే అవకాశం ఉంది. విద్యార్థులు ఆ చెట్టు కిందనే ఆడుకుంటూ ఉంటారు. ప్రమాదకరంగా ఉన్న ఆ చెట్టును తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – సుజాతనగర్

ప్రశ్నించాల్సిన అధికారి : జుంకీలాల్,
ఎంఈఓ, సుజాతనగర్
సెల్ నంబర్ : 9866706893

